క్లుప్తంగా

వేడుకగా లక్ష్మీనరసింహుడి కల్యాణం


స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ చేశారు. అనంతరం 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండపంలో కొలువు దీర్చి, విశేష ఆభరణాలు, సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. తరువాత వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు.

కండలేరులో 11.706 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 11.706 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 50 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మహాపాదయాత్రను జయప్రదం చేయండి

దక్కిలి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నిర్వహించనున్న విశ్వరూప మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ సమితి నాయకుడు గోవింద రంగయ్య మాదిగ తెలిపారు. శనివారం డక్కిలిలో ఆయన మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ లక్ష్యంగా సాగుతోన్న పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ అరుణోదయ సంస్థ నాయకుడు డీ కృష్ణ, ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకుడు జీ మునెయ్య,కే శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న విద్యాశాఖాధికారులు

వాకాడు: మండలంలోని వెంకటరెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు ఎస్ ప్రసన్న ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న నేపథ్యంలో శనివారం సహచర ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు ఆమెను ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు బీవీ కృష్ణయ్య, నసీంఅలీ, ఏఎంసీ చైర్‌పర్సన్ వీ నాగభూషణమ్మ, సర్పంచ్ బీ పోలమ్మ, హెచ్ఎం పీ ప్రవీణ్‌కుమార్, సంఘ కాపరి ప్రశాంత్‌బాబు, దినకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన రాకేష్

నాయుడుపేట టౌన్: మండలంలోని బిరదవాడ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాకేష్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మేనకూరు సెజ్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న బిరదవాడ గ్రామానికి చెందిన రాకేష్ శనివారం పరిశ్రమకు వెళ్లి, తిరిగి అతని మోటార్‌బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గం మధ్యలో ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించబోయి బైక్ అదుపు తప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాకేష్‌కు స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్‌పై దాడి

నాయుడుపేటటౌన్: లగేజీ ఆటోను ఢీకొన్న ట్రాక్టర్ డ్రైవర్‌ని ప్రశ్నించినందుకు లగేజీ ఆటో యాజమాని, డ్రైవర్ గుంజి శ్రీనివాసులుపై దాడి చేసి గాయపరచిన సంఘటన మండలంలోని పుదూరులో శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట పట్టణానికి చెందిన శ్రీనివాసులు తన లగేజీ ఆటో తీసుకుని మల్లాం గ్రామం వైపు బయలుదేరాడు. మండలంలోని పుదూరు సమీపంలో ఓ ట్రాక్టర్ వేగంగా ఎదురుగా వచ్చి లగేజీ ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటో దెబ్బతింది. ఈ విషయమై ట్రాక్టర్ డ్రైవర్ మర్రి సుధాకర్‌ను శ్రీనివాసులు ప్రశ్నించాడు. దీంతో పుదూరు గ్రామానికి చెందిన మర్రి సుధాకర్, భూపయ్యతో కలసి శ్రీనివాసులుపై ఇనుప రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన శ్రీనివాసులు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకుని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు వెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


చిల్లకూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు


చిల్లకూరు: వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్యాణ్

చిల్లకూరు: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, ఈ క్రమంలోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. చిల్లకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ హనుమంతరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీ దేవసేనమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ ఓ యమునమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, చిల్లకూరు వైస్ ఎంపీపీ పీ చెంగయ్య పాల్గొన్నారు.

మెరుగైన సేవలు

కోట: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొత్తపాళెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. వైద్యాధికారి ప్రసన్నరాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్ హరీష్‌చంద్రారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ అంజమ్మ, సర్పంచ్ ప్రసన్న, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ రమణయ్య, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, సొసైటీ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

వాకాడు: రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని దుగ్గరాజపట్నంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఆయన పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, సర్పంచ్ శ్రావణి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చిట్టమూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని మొలకలపూడిలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని వైద్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మధు యాదవ్, వీ చెంచయ్య, సుబ్బయ్య, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

చిల్లకూరు: పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరం అని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి అన్నారు. చిల్లకూరులో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైద్యులు ఉన్నారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం

డక్కిలి: అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వం లక్ష్యమని ఎంపీపీ జీ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని పాతనాలపాడు (కమ్మవారిపల్లె) సచివాలయంలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, దగ్గవోలు పీఏసీఎస్ అధ్యక్షుడు ఘట్టమనేని శ్రీనివాసులునాయుడు, సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సర్వే

దొరవారిసత్రం: ఏకొల్లు, వేణుంబాకం సచివాలయాల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం వైద్యసిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది స్వాతి, పావని, అవరావతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎంతో మేలు

సైదాపురం: జగనన్నఆరోగ్య సురక్ష రోగుల పాలిట వరమని జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖాధికారి ఖాదర్ వల్లి అన్నారు. మండలంలోని చాగణంలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ పెంచలయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైద్యులు జనార్దన్, శ్రావణి, ఏఓ పురుషోత్తం శివకుమార్, నాయకులు సుబ్బారెడ్డి, గంగయ్య, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య సురక్ష

వెంకటగిరిరూరల్: పేద ప్రజలు ఆరోగ్యకరంగా ఉండాలనే ధృడ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరంలా మారిందని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని చింతగుంట సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్యులు సాయి చరిత, శరత్‌చంద్ర, పల్లవి, రెడ్డి ప్రసాద్ సర్పంచ్ కాళే చెంచు ప్రసన్న, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే వైద్యసేవలు

రాపూరు: ప్రజల ముంగిటకే వైద్యసేవలు తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అడిషినల్ డీఎంహెచ్ఓ ఖదర్‌వల్లి అన్నారు. రాపూరు మండలం ఆకలివలసలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్యసురక్షను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రమిలా రాజకుమారి, అంజలి, సూర్యధర్మేంద్ర, నర్మదాదేవి, సర్పంచ్ పెంచలరెడ్డి పాల్గొన్నారు.


కోట: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు


వైద్య పరీక్షల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు


రాపూరు: వైద్యులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్ఓ ఖాదర్‌వల్లి


డక్కిలి: ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, నేతలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

ఉపాధి పనులకు రూ.36 కోట్ల బడ్జెట్


సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ నిర్మలాదేవి

చిల్లకూరు: మండలానికి ఈ ఏడాది ఉపాధి హామీ పథకంలో రూ. 36 కోట్ల లేబర్ బడ్జెట్టు వచ్చిందని ఎంపీడీఓ నిర్మలాదేవి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద సుమారు 11 వేల మంది వరకు పనులు చేస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది మండలానికి రూ.36 కోట్ల లేబర్ బడ్జెట్టు వచ్చినందున 16 ప్రాజెక్టుల్లో 97 రకాల పనులు, 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అహ్మద్‌బాషా, ఏపీఓ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలపై సమగ్ర సర్వే


సర్వే చేస్తున్న బృందం సభ్యులు

సైదాపురం: మండలంలోని ఓరుపల్లెలో శనివారం ఆరోగ్యసేవలపై నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే–6 కేంద్ర బృందం సభ్యులు రాండమ్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా టీమ్‌లీడర్ తులసిజ్యోతి మాట్లాడుతూ ప్రతి ఇంటినీ సందర్శించి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రధానంగా వ్యాధి నిరోధక టీకాలు, టీబీ, లెప్రసీ, కమ్యూనికేబుల్, నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్‌పై అందిస్తున్న ఆరోగ్య సేవలపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీలో 8 మంది సభ్యులుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ చరిష్మా, జిల్లా నోడల్ అధికారులు రాజయ్య, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభరెడ్డికి ఘన నివాళి


పద్మనాభరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: వాకాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీజీసీ సభ్యుడు డాక్టర్ నేదురుమల్లి పద్మనాభరెడ్డికి శనివారం పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు ఘన నివాలి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నేతలు కే.దామోదర్‌రెడ్డి, పీ.మనోజ్‌కుమార్‌రెడ్డి, ఆర్.రామకృష్ణ, పీ.రాజశేఖర్‌రెడ్డి, జీ.సుధాకర్‌రెడ్డి, ఎస్.పెంచలరెడ్డి, డీ.నాగూర్‌రెడ్డి, కే.కస్తూర్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి, ఎన్.హిమకుమార్‌రెడ్డి, ఎస్.గౌరవ్‌రెడ్డి, ఎస్.శ్రీధర్‌రెడ్డి, వీ.రవి, వీ.జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేటరూరల్: గ్రామాల్లో నీటి సమస్య ఎక్కువగా ఉందని, పరిష్కారంపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్యలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే జలజీవన్ మిషన్ పనులపై ఆరా తీశారు. అనంతరం విద్యాశాఖ అధికారులతో నాడు–నేడు పనులు, గ్రామాల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాలపై సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను వెంటే పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమీలారాణి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకీ సేవ


పల్లకిలో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం స్వామి వారి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన ద్వారకనాథ్‌రెడ్డి, హారతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిపై కొలువు దీర్చి ఊరేగించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన పెళ్లూరు సుమన్ ప్రజాపతి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కే ఆనంద్, ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

క్రీడల్లో వంజివాక విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోట: ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని వంజివాక జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి బంగారయ్య ప్రతిభ కనబరిచాడు. అండర్–14 షాట్‌పుట్ విభాగంలో మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం నాగయ్య శనివారం తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన బంగారయ్యను హెచ్ఎం నాగయ్య, పీడీ సందానీ, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తడ విద్యార్థి


రిషిత్

తడ: స్థానికంగా ఓ స్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న నత్తం రిషిత్ అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక అయ్యాడు. ఈ నెల 25వ తేదీన ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగే నేషనల్ స్కూల్ గేమ్స్ పాల్గొనేందుకు రిషిత్ ఎంపిక అయినట్టు పాఠశాల యాజమాన్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాభివృద్ధికి చర్యలు

పెళ్లకూరు: గ్రామాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ నాగేంద్రరెడ్డి అన్నారు. శనివారం బంగారంపేట సచివాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. అలాగే నిబంధనలు మేరకు పంచాయతీకి కేటాయించిన నిధులను సక్రమంగా సద్వినియోగం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యాస్మిన్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి


నాయుడుపేట టౌన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య


ఓజిలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: రాష్ట్రంలో అందరికీ మంచి జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంగా చేసుకోవాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేటలోని కేకే కల్యాణ్ సదన్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే నినాదంతో జరగనున్న కార్యక్రమంపై అర్బన్, రూరల్ వైఎస్సార్ సీపీ నాయకులు, జేసీఎస్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కే దీపిక, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు, సీహెచ్ కుమార్, కిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన

ఓజిలి: రాష్ట్రంలో సంక్షేమ పాలనను జగనన్నే అందిస్తున్నారని అలాంటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఓజిలి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు గుంటమడుగు రవీంద్రరాజు, వైస్ ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, మండల కన్వీనర్ పీ హరనాథ్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బాషా, ఏఎంసీ డైరెక్టర్ ప్రవీణ, నాయకులు డీ మధుసూదన్‌రెడ్డి, యూ హరనాథ్‌రెడ్డి, ఎం సుబ్బరావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి మించిన తనయుడు జగన్

పెళ్లకూరు: సుపరిపాలనతో రాష్ట్రంలో స్వర్ణయుగం సృష్టించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి మించిన తనయుడని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం పెళ్లకూరులోని చాగణం ట్రస్ట్ ప్రాంగణంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం సోమశేఖర్‌రెడ్డి, నగరి నియోజకవర్గం పార్టీ పరిశీలకులు సీ మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, పార్టీ మండల కన్వీనర్ వెంకటరత్నం, జేసీఎస్ కన్వీనర్ కరణం రఘునాయుడు, నాయకులు చైతన్యకృష్ణారెడ్డి, లింగమనాయుడు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీకి అసెస్‌మెంట్ క్యాంపు రేపు

గూడూరురూరల్ : పాఠశాలల్లో చదువుతున్న 18 ఏళ్ల లోపు ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల పంపిణీకి ఈ నెల 9వ తేదీన అసెస్‌మెంట్ క్యాంపు నిర్వహించనున్నట్లు భవిత కేంద్రం రిసోర్స్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, రోలేటర్లు, కాలిపర్సు, క్రచెస్, టీఎల్ఎం కిట్లను అందించేందుకు గూడూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ క్యాంపు జరుగుతుందని పేర్కొన్నారు. గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, బాలాయపల్లె, డక్కిలి మండలాల్లోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సోమ వారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. క్యాంపునకు ఫొటోలు, ఆధార్ జెరాక్స్, ఆదాయపు సర్టిఫికెట్, సదరం సర్టిఫికెట్, అడీప్ ఫారం తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఆయా మండలాల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఇందులో కలకత్తా శ్రీరామకృష్ణమిషన్ పీఠాధిపతి సుహితానంద జీ మహరాజ్, ఆయన శిష్య బృందం, మహానంది ఆలయ ధర్మకర్తమండలి చైర్మన్ కే.మహేశ్వర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.